క్లుప్తంగా

పసుపు రైతుల ధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘం నాయకుడు శివసాంబిరెడ్డి



కొల్లిపర: తెనాలిలో నేడు జరిగే అగ్నిబాధిత పసుపు రైతుల ధర్నాలో రైతులు వేల సంఖ్యల్లో పాల్గొని జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపరలో ఆదివారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభమ్ మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజీలో పసుపు కాలిపోయి నేటికి సంవత్సరం అయిందని, అయినా గానీ ఇన్స్యూరెన్స్ అధికారులు క్లెయిమ్‌లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. పసుపు రైతులకు మండలంలోని అందరు రైతులు అండగా ఉండి తెనాలిలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొమ్మారెడ్డి రంగారెడ్డి, బొంతు వెంకటరెడ్డి, అచ్యుత సురేష్, వంగా కోటిరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి, ఆరిగ బోసురెడ్డి, రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కఠెవరం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తమ సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూత

తెనాలిరూరల్: తెనాలి మారిస్‌పేటలోని రేపల్లె గేటు ఎదురు ఉన్న మద్రాసు గేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వేలైను పనుల కోసం సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు గేటును మూసి వస్తున్నామని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుని సహకరించాలని కోరారు.

దాడి ఘటనపై కేసు


తెనాలిరూరల్: వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన నలుగురిపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన హరికృష్ణ మాజీ రైల్వే కాంట్రాక్టరు వద్ద పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ముగ్గురు యువకులు రైల్వే కేబుల్ వైరును చోరీ చేసేందుకు ప్రయత్నించగా హరికృష్ణ వారిని వెంబడించగా ముగ్గురు పరారయ్యారు. ఒకరిని పట్టుకుని జీఆర్పీ పోలీసులకు అప్పగించాడు. దీనిని మనసులో పెట్టుకున్న దాసరి చేతన్, దేవరపల్లి మణి, బాలాజీ, గోపినాథ్ హరికృష్ణపై శనివారం దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

ఇంత పెద్ద జంక్షన్‌లో ఒక్క ప్రజా మరుగుదొడ్డి లేదు



మేడికొండూరు: పారిశ్రామిక కేంద్రమైన పేరేచర్ల జంక్షన్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ జంక్షన్‌లో మరుగుదొడ్ల లేక మహిళా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట రహదారుల కూడలి కావడంతో కార్మికులు, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. జంక్షన్‌లో బస్సుల కోసం వేచి ఉండేందుకు షెల్టర్ లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారుల విస్తరణ కార్యక్రమం చేపట్టారు. కానీ, ప్రజలకు, ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యం గురించి పూర్తిగా విస్మరించారు.

కార్మికుల సమస్యను పరిష్కరించండి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని పోరాట యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలోని ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు కె.ఆదినారాయణతో కలసి ఆయన ప్రారంభించారు. దీక్షా శిబిరంలో నవనీతం, శారద, రమణ, శారమ్మ, ధనమ్మ కూర్చున్నారు. ఆశీర్వాదం, అంకమ్మ, సూరి, సాంబయ్య, గురవయ్య, దుర్గాభవాని, ఇమాంబి, నాగేశ్వరరావు, సుబ్బారావు సంఘీభావం తెలిపారు.

నిర్లక్ష్యం.. నత్తేనయం!

- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా సబ్ జైలు నిర్మాణ పనులు
- రూ.3.30 కోట్లు నిధులు మంజూరు చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- జైళ్ల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో కేవలం బేస్‌మెంట్ వరకే నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో ఒక్క ఇటుకా పడని వైనం



బేస్‌మెంట్ వరకు నిర్మాణం జరిగిన సబ్‌జైలు

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలు నిర్మాణం నత్తేనయం అన్న చందంగా సాగుతోంది. పురాతన సబ్ జైలును పడగొట్టి, నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిర్మానం కేవలం బేస్‌మెంట్ వరకు మాత్రమే జరిగింది. తెనాలి సబ్ జైలు కీలమని తెలిసినా అధికారులు నిర్మాణ పనులను లక్ష్యపెట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

అధునాతన భవనానికి సంకల్పం..

సబ్‌జైలు భవన సముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ జైలును బ్రిటిష్ పాలకులు 1912లో నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయంలోనే ఇన్నాళ్లు ఖైదీలు ఉన్నారు. 2022లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జైళ్ల సంస్కరణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 113 ఏళ్ల క్రితం నిర్మించిన తెనాలి సబ్‌జైలు స్థానంలో అధునాతన సౌకర్యాలతో కూడిన జైలును నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అప్పటి జైళ్లశాఖ డీజీ అహసన్ రెజా తెనాలి జైలును 2022 సెప్టెంబరులో పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం సరిగాలేదని ఖైదీలు ఆయన దృష్టికి తెచ్చారు. రూ. 2.50 కోట్ల బడ్జెట్‌తో అధునాతన భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు.

నిధులు మంజూరు చేసిన గత ప్రభుత్వం..

ప్రస్తుతం ఉన్న సబ్‌జైలుకు అవకాశం ఉన్న మేర అదనంగా కొంత స్థలాన్ని సమకూర్చి రాష్ట్రంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలును నిర్మించాలని అధికారులు భావించారు. అందుకు తగ్గ స్థలం కేటాయించాల్సిందిగా అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తహసీల్దార్‌కు సూచించారు. రాష్ట్రంలోనే మోడల్ జైలుగా నిర్మించాలని 2022లో రూ.2.50 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. 2023 సెప్టెంబరులో సబ్‌జైలును మూసివేసి పనులు ప్రాంభించేందుకు రంగం సిద్ధం చేశారు. కొన్ని సాంకేతిక కారణాలు, అంచనా వ్యయం పెరగడంతో జైలును తిరిగి ప్రారంభించారు. అనంతరం రూ. 3.30 కోట్లతో అంచనాలను రివైజ్ చేశారు. నిధులు సైతం మంజూరై, అన్ని అనుమతులు లభించడంతో 2023 నవంబరులో అప్పటి సీనియర్ ఐపీఎస్ అధికారి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, ఇన్‌చార్జి డీజీ(జైళ్ల శాఖ) హరీష్‌కుమార్ గుప్తా తెనాలి సబ్ జైలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

నిలిచిపోయిన నిర్మాణం..

అయితే జైళ్ల శాఖ అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు కేవలం బేస్‌మెంట్ వరకు మాత్రమే నిర్మణం పూర్తయింది. కూటమి ప్రభుత్వంలో ఏడు నెలలుగా ఒక్క ఇటుక కూడా వేయలేదు. జైలు లేకపోవడంతో ఇక్కడి సంబంధించిన సిబ్బంది ఎవరూ ఉండడంలేదు. తెనాలి సబ్ జైలు ఖైదీలను గుంటూరు జిల్లా జైలుకు లేదా బాపట్ల, రేపల్లె సబ్ జైలుకు పంపాల్సి వస్తోంది. కోర్టు కానిస్టేబుళ్లు పోలీసులకు ఇదోరకంగా తలనొప్పిగా మారింది. ఇతర జైళ్ల వార్డెన్‌లు ఖైదీలను అనుమతించే విషయంలో 'కొన్ని' షరతులు పెడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

పోస్టల్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన డీఎస్ఎన్

సంస్మరణ సభలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

తెనాలి: గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఢిల్లీ వరకు ఉద్యమాన్ని నడిపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన పోస్టల్ ఉద్యమనేత దేవిరెడ్డి శివ నాగేశ్వరరావు (డీఎస్ఎన్) ఆరంభించిన ప్రయాణాన్ని పరిపూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా అందరినీ సమీకరించి ఐక్యవేదిక ద్వారా అద్భుతమైన విజయాలను సాధించిన ఉద్యమనేత డీఎస్ఎన్ సంస్మరణ సభను ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎం.తిరుమలరావు అధ్యక్షతన జరిగింది. ప్రొఫెసర్ కాశీం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నేడు దేశంలో పెట్టుబడిదారుల ప్రగతే దేశ అభివృద్ధి నమూనాగా మారిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు బాటన పట్టిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని టోకున విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టే అభివృద్ధి నమూనా జరుగుతోందని చెప్పారు. డీఎస్ఎన్ బాటలోనే ఐక్యంగా ఉద్యమించి హక్కులను కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు అంబటి నాగన్న మాట్లాడుతూ మనిషితత్వాన్ని పరిమళించిన డీఎస్ఎన్, మనిషనేవాడుఎలాంటి జీవితాన్ని గడపాలనే సిలబస్ ఇచ్చాడని చెప్పారు. పీబీవీ గణేష్ మాట్లాడుతూ ఉద్యమనేతగా సాధారణ పోస్టల్ ఉద్యోగుల హక్కులకోసం కృషిచేసిన డీఎస్ఎన్, వారికోసం సహకార సొసైటీని స్థాపించి 20 ఏళ్లుగా అభివృద్ధి చేయటం గొప్ప విషయమన్నారు. నాలుగువేల మంది సభ్యులతో రూ.పదుల కోట్ల డిపాజిట్లతో నడుస్తున్న సొసైటీలో ఎలాంటి అవినీతి లేకపోవటం డీఎస్ఎన్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. హక్కుల పోరాటంతోపాటు మానవీయ విలువలను ఆయన మనకు అందించారని చెప్పారు. అఖిల భారత గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకుడు బి.వెంకటేశ్వర్లు తన ప్రసంగంలో డీఎస్ఎన్ స్ఫూర్తితోనే తెలంగాణలో గ్రామీణ తపాల ఉద్యోగుల సహకార సొసైటీని స్థాపించాననీ, అందుకాయన ఎంతగానో సహకరించారని చెప్పారు. సభలో పోస్టల్ ఉద్యోగుల ఏపీ సర్కిల్ కార్యదర్శి పి.ఎస్.డేవిడ్‌రాజు, ఎన్‌యూపీఈ, పీఎంఅండ్ఎంటీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్‌యూడీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి ఎస్.యోగీశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్రనేత కె.కృష్ణ, నండూరి నారాయణ, శివకృష్ణ, జనసాహితి నేత చందు నాగేశ్వరరావు, విశ్రాంత వైద్య ప్రొఫెసర్ విజయకుమార్ తదితరులు మాట్లాడారు. ప్రజాకళామండలి కోటి బృందం విప్లవగీతాలను ఆలపించింది.

ఆరు దశాబ్దాల స్నేహం.. ఆనంద పారవశ్యం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ స్నేహితులు

- 60 ఏళ్ల తరువాత కలుసుకున్న నేస్తాలు
- ఆటపాటలతో రోజంతా గడిపిన మహిళలు



స్నేహితుల ఆటపాట

తెనాలి: పూర్వవిద్యార్థుల సమావేశాలు చూశాం... విన్నాం... పూర్వ స్నేహితుల కలయిక... అదికూడా మహిళామణుల ఆత్మీయ సమ్మేళనం.. తెనాలి ప్రాంతంలో ఆదివారం జరిగింది. రూరల్ మండల గ్రామం బుర్రిపాలెంలో అక్కడి కల్యాణమండపం వేదికగా 'బుర్రిపాలెం గ్రామ పూర్వస్నేహితులు ఆత్మీయ సమ్మేళనం' కోలాహలంగా నిర్వహించారు. 1960 ప్రాంతాల్లో కలిసి చదువుకుంటూ, ఆడుకుంటూ గడిపిన ఆడపిల్లలు వారంతా. మొత్తం 17 మంది. చదువులు పూర్తయి, పెళ్లిళ్లయ్యాక ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వీరిలో కొందరు ఉద్యోగాలు చేసి రిటైరైనవారు ఉన్నారు. ఎక్కువశాతం గృహిణులే ఉన్నారు. హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రంలో స్థిరపడిన వీరిలో కొందరు తోటివారి సమాచారం తెలుసుకుంటూ వస్తున్నారు. అంతా కలసి సొంతూరులో సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా కార్యాచరణ ఆరంభమైంది. ఫలితంగానే ఆదివారం రోజున బుర్రిపాలెం గ్రామంలో ఆ పదిహేడుగురు కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాపికొండలు యాత్రలో బోటులో ఆటపాట నిర్వహించే ఈవెంట్ పార్టీని రప్పించారు. వారి తోడ్పాటుతో దాండియా ఆటలతో సహా పలురకాల ఆట, పాటల్లో ఒకనాటి స్నేహితులు మురిసిపోయారు. గ్రామంలోని బంధుమిత్రులతో కలిసి విందు భోజనం ఆరగించారు. సాయంత్రం వరకు మధురానుభూతులను మూటగట్టుకున్నారు. మరోసారి కలుసుకుందామని చెప్పుకుని వీడ్కోలు తీసుకున్నారు. హెచ్‌సీఎల్ విశ్రాంత ఉద్యోగిని రాజేశ్వరి, హేమలత, నిర్మల పర్యవేక్షించారు.

సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానం ఉండాలి

హైదరాబాద్‌లోని టిస్– ఎస్ఈఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి

చేబ్రోలు: సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాల రూపకల్పన జరగాలని, సమాజానికి అవసరమైన నైపుణ్యాలు, టెక్నా లజీ సంబంధిత మార్పులను అధ్యాపకులు ఎప్పటికప్పుడు గుర్తించాలని హైదరాబాద్‌లోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్)– స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ (ఎస్ఈఎస్) చైర్‌పర్సన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఆన్ హార్నెస్సింగ్ ద సైన్స్, టెక్నాలజీ అండ్ సొసైటీ రిలేషన్‌షిప్ ఫర్ మీనింగ్‌ఫుల్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై 3 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. టిస్ – ఎస్ఈఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను ప్రపంచస్థాయికి తీసుకువచ్చి ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలన్నారు. సైన్స్, టెక్నాలజీ మరియు సమాజం మధ్య సంబంధాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఇది ఉన్నత విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రామాణికమైన మార్పులకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. హైదరాబాద్‌లోని టిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్ సేన్ గుప్త, ముంబాయిలోని టిస్ సీనియర్ రీసెర్చ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రఫిఖ్ షేక్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండలో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 91 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 44 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. వీరికి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తనీమా, బండ్ల పట్టాభిరామయ్య, స్థానిక మిత్ర బృందం సభ్యులు ధనేకుల హరిబాబు, కొలికపూడి రమేష్, షేక్ రఫి, తాయి శ్రీ హరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు అభినందన



తాడేపల్లిరూరల్: మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్, పద్మలత దంపతులు ఆదివారం మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిశారు. టీడీపీ సభ్యత్వ నమోదు 1.52 కోట్లకు చేరుకోవడంలో కృషి చేసిన మంత్రిని అభినందించారు. అనంతరం అన్నే చంద్రశేఖర్ దంపతులు వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాన్ని నారా లోకేష్‌కు అందజేశారు. టీడీపీ నాయకులు అన్నె నందకిషోర్, బోయపాటి రమేష్ పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు వేమన

కాకుమాను: సామాజిక విప్లవకారుడు యోగి వేమన అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రజాకవి యోగి వేమన జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మోహనరావు మాట్లాడుతూ పండిత లోకానికి పరిమితమైన వేదాంతాన్ని పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో సరళమైన పదాలతో, స్వచ్ఛమైన, అచ్చమైన తేనె లాంటి తెలుగు పద్యాలతో వివరించిన మహానుభావుడు వేమన అని ఆయన తెలిపారు.

రెండు ఇళ్లల్లో చోరీలు



గుంటూరు రూరల్: రెండు ఇళ్లలో నగలు, నగదు చోరీ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. నాయుడుపేటలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీనివాసనాయక్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో పండుగ సెలవుల నిమిత్తం ఊరు వెళ్ళి తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. అదే విధంగా పక్కనే ఉన్న మరో ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించారు. శ్రీనివాసనాయక్ ఇంట్లో 200 గ్రాముల బంగారం, కొంత మొత్తంలో నగదు చోరీ జరిగినట్లు పక్కన ఇంట్లో 50 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నడక ప్రాధాన్యతపై ఉద్యమస్థాయి ప్రచారం

- ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–203 గవర్నర్ పెద్ది శివరామప్రసాద్
- ఘనంగా వాకర్స్ క్లబ్ రజతోత్సవం



సత్కార గ్రహీతలతో అతిథులు

తెనాలి: వేగం పెరిగిన నేటి జీవనవిధానంలో ఎక్కువమంది జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారనీ, ప్రతిరోజూ కొద్దిసేపు నడకతో ఆరోగ్యంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–203 గవర్నర్ పెద్ది శివరామప్రసాద్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నడక ప్రాధాన్యతపై ఉద్యమస్థాయిలో ప్రచారం జరగాలని ఆయన సూచించారు. ఇందుకు వాకర్స్ క్లబ్‌లపై గురుతర బాధ్యత ఉందన్నారు. వాకర్స్ క్లబ్, తెనాలి 25వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవనలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్ది శివరామప్రసాద్ తన ప్రసంగంలో వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ గవర్నర్ విధులను, మహాత్మాగాంధీ ఫెలో (ఎంజీఎఫ్) గురించి వివరించారు. విశిష్ట అతిథి చెలికాని సీతారామయ్య మాట్లాడుతూ 2017లో తాను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఉన్నపుడు 200 కొత్త క్లబ్‌ల ఏర్పాటుకు చూపిన చొరవను తెలియజేశారు. క్లబ్‌ల నుంచి విరాళాల రూపంలో వసూలుచేసిన నిధులతో విశాఖపట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థకు సొంత భవనం ఏర్పాటుచేయగలిగినట్టు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌కు రూ.6 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెబుతూ వాటిపై వచ్చే వడ్డీని మాత్రమే సామాజిక సేవకు, క్లబ్ కార్యకలాపాలకు వినియోగిస్తామని తెలిపారు. డిస్ట్రిక్ట్ ట్రెజరల్ లఘువరపు సత్యనారాయణ మాట్లాడారు. క్లబ్ తరపున ఉత్తమ వాకర్‌గా మెడతాటి బాపూజీ, మహిళా వాకర్‌గా ఎస్.ధనలక్ష్మి, ఉత్తమ యోగసాధకులు తుమ్మలపల్లి ఉషారాణి, స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ సోల్జర్ అధ్యక్షుడు షేక్ ఇనయతుల్లాను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు నివేదికను సమర్పించారు. క్లబ్ సభ్యులు త్రిపురనేని రత్తయ్య, అశోక్‌కుమార్, నారాయణ, రంగారావు, నరేంద్ర, సంకా ఉదయశంకర్, మొవ్వా సత్యనారాయణ, ఇతర్ క్లబ్‌ల సభ్యులు జీవీ నారాయణ, అశోక్, అర్జునరావు, డాక్టర్ జేఎస్‌సీ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం



సాయిబాబా, గురుదేవులను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్



సాయిబాబా కథా నృత్యగీతిక ప్రదర్శన

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని సాయినాథుని సత్సంగ కేంద్రం 33వ వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. సత్సంగ కేంద్రం నుంచి శనివారం సాయంత్రం సాయిబాబా, గురుదేవుల ఉత్సవమూర్తులను హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగింపుగా బుర్రిపాలెంరోడ్డులోని టీజీకే కల్యాణ మండపానికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన లెండివనంలో హారతి, నివేదన ఇచ్చారు. రెండోరోజైన ఆదివారం బాబా నామము సత్సంగ సదస్సులతో నిర్వహించారు. తదుపరి సామూహిక సాయిసచ్చరిత్ర పారాయణం చేశారు. ప్రముఖ నృత్యగురువు నిర్మల రమేష్ శిష్యబృందం సాయిబాబా కథా నృత్యగీతికను ప్రదర్శించి భక్తులను ఆనందపరవశులను చేశారు. మధ్యాహ్నం సాయిబాబు, గురుదేవులకు హారతి, నివేదన చేశారు. భక్తులు అధికసంఖ్యలో అన్నసంతర్పణలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నారాయణం సాయిసత్య శ్రావణి కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. తూములూరు వెంకట సుబ్రహ్మణ్యం శరత్‌బాబూజీతో తన అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. చివరగా బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి సాయిసచ్చరిత్ర నుంచి పారాయణ చేశారు. సత్సంగ కేంద్రం కన్వీనర్ వీఎస్ నాగభూషణరెడ్డి వార్షిక నివేదికను సమర్పించారు. బాబా, గురుదేవులకు హారతి, ప్రసాద వినిమయంతో కార్యక్రమాలు ముగిశాయి. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేకంగా హాజరై సాయిబాబు, గురుదేవులను దర్శించుకున్నారు. కొల్లిపర దత్తు, ఎం.ఫణి, ఎం.సాయి, గోపు శ్రీనివాస్, రామలింగేశ్వరరావు, నాగేశ్వరరావు, ఢాకా సాంబిరెడ్డి, వెంకటేశ్వరరావు, టీజీకే కృష్ణ పర్యవేక్షించారు.

మాధవరావు మృతి సమాజానికి తీరనిలోటు

సంస్మరణ సభలో మానవ హక్కుల వేదిక రాష్ట్రనేతలు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్

తెనాలి: అణచివేత చట్టాల మూలాలు ఎక్కడున్నాయి...ఎలా విస్తరిస్తున్నాయనే అంశాలపై అవగాహనతో ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న హక్కుల ఉద్యమనేత, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు ఆకస్మిక మృతి సమాజానికి తీరనిలోటని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ అన్నారు. మానవ హక్కుల వేదిక తెలంగాణ పూర్వ అధ్యక్షుడు, పాత్రికేయుడు, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణను ఆదివారం రాత్రి తెనాలిలో ఏర్పాటుచేశారు. మానవ హక్కుల వేదిక, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నందులపేటలోని కవిరాజ పార్కులో గల వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు వేదిక కృష్ణా జిల్లా కన్వీనర్ జి.రోహిత్ అధ్యక్షత వహించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నపుడే రాజకీయాల్లో చురుకుగా వుంటూ వచ్చిన మాధవరావు సమాజంలో పెరుగుతున్న విద్వేష రాజకీయాలపై అవగాహన కలిగిన వ్యక్తిగా చెప్పారు. తోటి పౌరులకు న్యాయసహాయం అందిస్తూనే అణచివేత చట్టాలు, విద్వేష రాజకీయాలపై ప్రజాచైతన్యానికి వృత్తిపరంగా, వేదిక పరంగా, రచనా పరంగా విశేషమైన కృషిచేశారని చెప్పారు. ఆరకమైన కృషి మరింతగా జరగాల్సిన సమయంలో ఆయన హఠాన్మరణం విషాదమన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు తన ప్రసంగంలో పౌరహక్కుల సంఘంలో డాక్టర్ బాలగోపాల్‌తో కలిసి తాను, మాధవరావు కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారు. హక్కుల వేదిక వ్యవస్థాపకుల్లో ఇద్దరమూ ఉన్నట్టు తెలిపారు. మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ మాట్లాడుతూ మాధవరావు బూటకపు ఎన్‌కౌంటర్లలో బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించేందుకు కోర్టుల ద్వారా తన వంతు కృషిచేశారని వివరించారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, జుగాష్‌విలి, నండూరి నారాయణ, కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర నాయకుడు కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన సమాజానికి ఆదర్శం

దొంతిరెడ్డి వేమారెడ్డి



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: యోగి వేమన సమాజానికి ఎంతో ఆదర్శమని, ఆయన సూక్తులు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందాయని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త, అఖిల భారత రెడ్ల సంక్షేమ సమాఖ్య, శ్రీశైలం సత్ర సమూహాలకు రాష్ట్ర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని కళ్ళం రత్తారెడ్డి తులసమ్మ సత్రంలో నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి వేమారెడ్డి మాట్లాడుతూ రెడ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమ సమాజ స్థాపనకు ఎన్నో ఉద్యమాలు చేసి, ప్రాణత్యాగం చేసిన చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి వారందరూ ప్రస్తుత కాలంలో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. మళ్లీ రెడ్ల జాతి కోసం కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దానికి ఒకటే మార్గమని, ఎంతో మంది పేద రెడ్ల పిల్లలకు విద్య నేర్పించి, ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలని కోరారు. ఏ జాతి అయినా అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమని వేమారెడ్డి స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం హటక్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి అవసరమైన నిధులను సేకరిస్తామని చెప్పారు.